క్లుప్తంగా

ఘనజీవామృతం తయారీపై అవగాహన


ఘన జీవామృతం తయారు చేస్తున్న సర్పంచ్ సూర్యకుమారి

రావికమతం: ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి ఎంతో మేలని సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలు గురించి ప్రకృతి వ్యవసాయ విభాగం క్లస్టర్ ఇన్‌చార్జి యర్రంశెట్టి నిర్మల ఆధ్వర్యంలో కవగుంటలో పలువురు రైతులకు అవగాహన కల్పించారు. ఘనజీవామృతం తయారీపై వివరించారు. ఆవుపేడ, మూత్రం, బెల్లం, పుట్టమన్ను సమపాళ్లలో కలిపి తయారు చేసే విధానాన్ని తెలియజేశారు. పంటకు ఘనజీవామృతం వాడకంతో చీడపీడలు దరిచేరవని, అధిక దిగుబడి, ఆదాయంతోపాటు ఆరోగ్యదాయకమని తెలిపారు.

20న చలో విజయవాడ


మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమావేశం

చోడవరం రూరల్: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈ నెల 20న చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టినట్టు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల యూనియన్ నాయకురాలు గూనూరు వరలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక మెయిన్ స్కూల్‌లో యూనియన్ సభ్యులు సమావేశమయ్యారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనాలు, మెనూ చార్జీల పెంపు, బడ్జెట్ పెంపుదల, ఉపాధి భద్రత ప్రధాన డిమాండ్లుగా విజయవాడలో ధర్నా చేపట్టనున్నట్టు వివరించారు. యూనియన్ ప్రతినిధులు ఆర్.బుచ్చిరాజమ్మ, జి.లక్ష్మి, బి.చింతల్లి, ఎ.ఈశ్వరమ్మ, జి.రామలక్ష్మి, నారాయణమ్మ పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో నూకాంబిక అమ్మవారు

మాడుగుల రూరల్: కె.జె.పురం నూకాంబిక అమ్మవారి ఆలయంలో మాలాధారణ భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 12న 30 మంది భక్తులు అమ్మవారి మాలాధారణ చేశారు. రోజూ ఆలయంలో పూజాది కార్యక్రమాలతోపాటు భజనలు చేస్తున్నారు. గురుమాత శీలం దేముళ్ల సారధ్యంలో భక్తులు సహకారంతో కొత్త అమావాస్య ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 21వ తేదీన మాలాధారణ పూర్తవుతుందని పేర్కొన్నారు.

ఇంటి పన్నులు వసూలు చేయాలి


గ్రామ పటాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

మాకవరపాలెం: శత శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. తాడపాల గ్రామాన్ని గురువారం ఆమె సందర్శించారు. అక్కడ చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. గ్రామాలు నిత్యం పరిశుభ్రంగా ఉండాలన్నారు. స్వామిత్ర సర్వేలో భాగంగా గ్రామపటాన్ని పరిశీలించారు. ఇంటి పన్నుల వసూల్లో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. బకాయిలపై దృష్టి పెట్టాలన్నారు. ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి, కార్యదర్శులు ఉన్నారు.

రేపు జి.కొత్తపల్లిలో గృహసారథుల సమావేశం

చీడికాడ: జి.కొత్తపల్లిలో ఈ నెల 18న గృహసారథులతో సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య తెలిపారు. ఈ సమావేశం శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభం కానుందన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరు కానున్నారని తెలిపారు. సచివాలయాల కన్వీనర్లతో పాటు గృహసారథులు, పార్టీ నేతలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ సంఘాల నేతలు విధిగా పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి!

- యూకలిప్టస్ తోటపై అక్రమార్కుల కన్ను
- గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్న వైనం


గాంధీనగరం సమీపంలో ఏపుగా పెరిగిన యూకలిప్టస్ తోట

నాతవరం: అధికారుల ఉదాసీనత వైఖరి వల్ల ప్రభుత్వానికి ఆదాయానిచ్చే యూకలిప్టస్ తోట మాయమవుతోంది. మండలంలోని గాంధీనగరం వద్ద నర్సీపట్నం – తుని ఆర్అండ్‌బీ రోడ్డుకు ఆనుకుని పెదిమికొండ అటవీ ప్రాంతంలో నర్సరీ ఉంది. ఇందులో ఆరెకరాల విస్తీర్ణంలో గాంధీనగరం గ్రామానికి చెందిన వన సంరక్షణ సమితి సభ్యులు 1997లో యూకలిప్టస్ మొక్కలు వేసి తోట పెంచారు. ఈ తోట ప్రస్తుతం భారీ వృక్షాలుగా పెరిగి ఈదురుగాలులకు నెలకొరుగుతోంది. అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణ నామమాత్రంగా ఉండటంతో కొంత మంది సొంత అవసరాలకు అక్రమంగా నరికి తరలించుకుపోతున్నారు. రెండేళ్ల క్రితం గాంధీనగరం గ్రామానికి చెందిన కొంతమంది రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా యూకలిప్టస్ చెట్లను నరికి ట్రాక్టరుపై రవాణా చేస్తుండగా, స్థానికులు పట్టుకుని అధికారులకు అప్పగించారు. అప్పట్లో వారిపై కేసులు నమోదు చేయడంతో కొంత కాలం పాటు అక్రమార్కుల ఆగడాలు తగ్గాయి. ఇటీవల మరలా కొంతమంది ఏపుగా పెరిగిన యూకలిప్టస్ చెట్లపై కన్నేశారు. పథకం ప్రకారం అక్రమంగా తరలించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకేసారి కాకుండా దఫా దఫాలుగా గుట్టుచప్పుడు కాకుండా చెట్లను నరికి రవాణా చేస్తున్నారు. యూకలిప్టస్ తోటకు ఇరువైపులా తారురోడ్డు ఉండటంతో రాత్రిళ్లు అనువుగా ఉండటంతో అధికారులు కళ్లుకప్పి తరలించుకుపోతున్నారు. యూకలిప్టస్ తోటను కటింగ్ చేయాలని, కొంతకాలంగా గాంధీనగరం గ్రామపెద్దలు అధికారులను కోరుతున్నారు. తోట కటింగ్ చేయడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు స్థానికులకు కొన్ని రోజులపాటు గ్రామంలోనే కూలీ పని దొరుకుతుందని ఆశిస్తున్నారు. గ్రామస్తుల విన్నపాలను అటవీశాఖ అధికారులు నేటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇదే పరిస్థితి కొనసాగితే తోట తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయని వాపోతున్నారు. ఈ విషయంపై అటవీశాఖ సెక్షన్ అధికారి మహేష్‌గిరిని వివరణ కోరగా, యూకలిప్టస్ తోట కటింగ్ చేసేందుకు అనుమతి కోసం ప్రభుత్వానికి ఇటీవల నివేదించామన్నారు. ఆదేశాల రాగానే త్వరలో తోట కటింగ్ చేస్తామన్నారు.

ఉపాధి పనుల్లో రూ. 7 వేల అవకతవకలు


మాట్లాడుతున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

నాతవరం: క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఉపాధి హామీ పనుల్లో రూ.7 వేల వరకు అవకతవకలు గుర్తించామని, నిబంధనల ప్రకారం వాటిని రికవరీ చేస్తామని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి నెలాఖరు వరకు రూ. 20 కోట్లతో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఎస్ఆర్పీ రాజు ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా 15 రోజులపాటు క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామసభలు నిర్వహించారన్నారు. ఎలక్షన్ కోడ్ కారణంగా కలెక్టరు ఆదేశాల ప్రకారం పెందుర్తిలో ప్రజావేదిక ఏర్పాటు చేశామన్నారు. గురువారం సామాజిక తనిఖీల బృందం రికార్డులు అప్పగించాయన్నారు. ఎన్నికల కోడ్ వల్ల మండలంలో గ్రామసభలకు సర్పంచులను, ఎంపీటీసీలను, ప్రజాప్రతినిధులను ఆహ్వానించలేదన్నారు. ఉపాధి ఏపీవో చిన్నారావు, డీఆర్పీలు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ అమ్మవారి తీర్థం


మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల రూరల్: మాడుగుల నుంచి ఖండివరం వెళ్లే రహదారిలో మరిడిమాంబ అమ్మవారి తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారిని స్థానిక ప్రజా ప్రతినిధులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉత్తరాంధ్ర స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రాత్రికి కోలాటం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఇంటర్ పరీక్షకు 38 మంది గైర్హాజరు

చోడవరం రూరల్: పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ కేంద్రాల్లో 1,449 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 23 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 517 మందికి గాను 511 మంది హాజరు కాగా ఆరుగురు రాలేదు. ఉషోదయా కళాశాలలో 498 మందికి 488 మంది హాజరయ్యారు, పది మంది గైర్హాజరయ్యారు. 4ఎస్ కళాశాలలో 434 మందికి 427 మంది హాజరయ్యారు. ఏడుగురు గైర్హాజరయ్యారని ఆయా కళాశాలల యాజమాన్యాలు తెలిపాయి. తొలి రోజు పరీక్షలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకపోవడం పట్ల యాజమాన్యాలు సంతృప్తి వ్యక్తం చేశాయి.

రోలుగుంటలో ఆరుగురు..

రోలుగుంట: స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 248 మందికిగాను 242 మంది హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరయ్యారు. చీఫ్‌గా వసుదేవుడు, డీవోగా బి.ఎరిస్వామి వ్యవహరించారు. పరీక్ష కేంద్రం వద్ద 144వ సెక్షన్ అమలు పరిచారు. ఇతరులు లోపల ప్రవేశించకుండా ఎస్సై బి.నాగకార్తీక్, హెడ్ కానిస్టేబుల్, నలుగురు సచివాలయాలకు చెందిన మహిళా సంరక్షణ కార్యదర్శులను బందోబస్తు ఏర్పాటు చేశారు.

దేవరాపల్లిలో 9 మంది

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు, హిందీ, జీఎఫ్‌సీ సాన్స్క్రిట్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు 304 మంది విద్యార్థులకుగాను 295 మంది హాజరయ్యారు. వెరసి 9 మంది గైర్హాజరయ్యారు. సీసీ కెమెరాలతోపాటు పోలీస్ బందోబస్తు మధ్య పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ యు.వి.ఎస్.వర్మ తెలిపారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు


విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ప్రిన్సిపాల్

చోడవరం రూరల్: శరీరంలోని అనేక అసమానతలకు, రుగ్మతలకు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఉపశమనం కలిగిస్తాయని ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఎక్కువగా తీపి పదార్థాలను తీసుకోవద్దని, చర్మ స్వచ్ఛత, ఆహార క్రమశిక్షణ అవసరమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, ఉపన్యాసకులు సత్యనారాయణ, రామలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పీవోలు డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, బి.లక్ష్మి, సరస్వతి పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు


పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాసవీ సభ్యులు


అమరజీవి విగ్రహానికి పూలమాల వేస్తున్న సీఐ మహమ్మద్ తదితర్లు


పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాసవీక్లబ్ ప్రతినిధులు


దేవరాపల్లిలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

రావికమతం: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని మండలంలో గురువారం నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ సభ్యులు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ పాల్గొని అమరజీవి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్షతో ప్రాణత్యాగం చేసి ఇప్పటికీ అందరి హృదయాల్లో జీవించే ఉన్నారన్నారు. రావికమతం మూడు రోడ్ల కూడలిలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి స్థానిక ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, టి.అర్జాపురం హైస్కూల్‌లో ఉపాధ్యాయులు అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కొత్తకోట సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, ఆర్యవైశ్య సంఘం సభ్యులు రమేష్, అశోక్ తదితర్లు పాల్గొన్నారు.

చోడవరం రూరల్: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు 122వ జయంతిని గురువారం స్థానిక ఆర్యవైశ్య చిన్న సత్రం వద్ద నిర్వహించారు. చోడవరం వాసవీ మెయిన్ క్లబ్, వనితా క్లబ్, కపుల్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. వాసవీ క్లబ్ ప్రతినిధులు కలగర్ల శేషగిరిరావు, శ్రీనాథు వెంకట మధు, పి.వి.రమణమూర్తి, పి.సునీల్, పి.సతీష్, కొల్లూరు మంగరాజు, పసుమర్తి వెంకట్ పాల్గొని పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు.

నర్సీపట్నం: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ముందుగా గ్రంథాలయ అధికారి దమయంతి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని వివరించారు. ఉపాధ్యాయుడు పి.నారాయణరావు, వాసవి క్లబ్, వాసవి కల్యాణ మండపం సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. వాసవి కల్యాణ మండపం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెలగా నారాయణరావు, సి.ఎస్.కుమార్, నారాయణరావు పాల్గొన్నారు.

దేవరాపల్లి: స్థానిక గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి గ్రంథాలయాధికారి ఓ. శ్రీనివాసరావు ఘన నివాళులర్పించారు. విశ్రాంత వీడీవో జి.రామ్మూర్తి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

గడువులోపు భూ రీసర్వే పూర్తి చేయండి

నర్సీపట్నం ఆర్డీవో జయరాం ఆదేశం


మాట్లాడుతున్న నర్సీపట్నం ఆర్డీవో జయరాం

రోలుగుంట: గడువులోపు రైతులకు మేలు చేసేందుకు సమగ్ర భూ రీసర్వే పూర్తి చేయాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. దీనిలో భాగంగా గ్రామస్థాయి సర్వేయర్లతో సమావేశమయ్యారు. గ్రామాల వారీగా భూ సర్వే ఎంత మేర పూర్తయిందో అడిగి తెలుసుకున్నారు. కొవ్వూరు, ఎదుళ్లవలస రెవెన్యూలో రైతుల సమాచారం లోపంతో ఏర్పడిన ఖాతాల సమస్యపై ఆరా తీశారు. రైతులను రప్పించి వెంటనే అవసరమైన ధ్రువపత్రాలు తీసుకుని త్వరితగతిన సమస్యను పరిశీలించి మేలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మందుల కొరత లేకుండా చర్యలు


మందుల స్టోరేజ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్యామ్‌సుందర్

చోడవరం: ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని వైద్యాధికారులను ఎంపీడీవో డి. శ్యామ్ సుందర్ ఆదేశించారు. గవరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో మందుల విభాగం, ల్యాబ్, పేషెంట్ల వెయిటింగ్ హాల్ ప్రదేశాలను పరిశీలించారు. వైద్యసేవలు, ఆస్పత్రిలో సౌకర్యాలపై వైద్యాధికారి దమయంతిని అడిగి తెలుసుకున్నారు. మందుల స్టోరేజ్‌పై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఎపిడమిక్ సీజన్ నడుస్తున్నందున వైరల్ జ్వరాల విజృంభణపై వైద్య సిబ్బంది అప్రమతంగా ఉండాలన్నారు. ప్రజలు పరిశుభ్రతపై చైతన్య పరచాలన్నారు.

యూటీఎఫ్ మండలాధ్యక్షుడిగా సతీష్


అధ్యక్షుడు సతీష్


ప్రధాన కార్యదర్శి కేశవరావు

రోలుగుంట: యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంపీపీ పాఠశాలలో మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా యు.నాగభూషణం, అధ్యక్షుడిగా కాలింగ సతీష్, ప్రధాన కార్యదర్శిగా కె.కేశవరావు, సహాధ్యక్షులుగా సిహెచ్.మణి సూర్యకుమార్, బి.భారతి, కోశాధికారిగా ఎం.ఎస్.ఎస్.ఎస్.ఎస్.ఎన్.మూర్తి, కార్యదర్శిగా సరోజిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల. పరిశీలకులుగా యూనియన్ జిల్లా సహాధ్యక్షురాలు పి.గాయిత్రి వ్యవహరించారు. ఎన్నికైన కమిటీతో జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి ప్రమాణ స్వీకారం చేయించారు. యూనియన్ నిబంధనలకు కట్టుబడి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతర సేవలందిస్తామన్నారు.

ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సేవలు

నర్సీపట్నం డీఎల్డీవో ఉదయశ్రీ


సచివాలయంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎల్డీవో ఉదయశ్రీ

నాతవరం: ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని నర్సీపట్నం డీఎల్డీవో ఉదయశ్రీ హెచ్చరించారు. ఎం.బెన్నవరం పంచాయతీలో గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ముందుగా సచివాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించి సిబ్బందితో సమీక్షించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు, స్టాకును పరిశీలించి గర్భిణులతో మాట్లాడారు. పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో ముచ్చటించి నిబంధనల ప్రకారం కేంద్రం నిర్వహణ ఉండాలని కార్యకర్తకు సూచించారు. జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఉగాది కల్లా కలెక్టరు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణతో పంచాయతీలకు ఆదాయం రావడంతోపాటు ప్రజలకు రోగాలు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. ఈ నెలాఖరులోగా శత శాతం ఇంటి పన్నులు వసూలు చేయడంపై దృష్టి సారించామన్నారు. దీనిపై సచివాలయ కార్యదర్శులకు ప్రత్యేకంగా ఆదేశించామన్నారు. వేసవి దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మార్తి నాగమణి, హౌసింగ్ జేఈ జోగారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

మార్మోగిన సత్యసాయి నామస్మరణం


సత్యసాయి భక్తుడు సన్యాసిశెట్టిని సత్కరిస్తున్న భక్తులు

దేవరాపల్లి: సత్యసాయి నామస్మరణంతో దేవరాపల్లి మార్మోగింది. ఇక్కడ రామాలయంలో నిర్వహించిన భజన కార్యక్రమంలో దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల నుంచి అధికంగా సత్యసాయి భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవరాపల్లి, కె.కోటపాడు సత్యసాయి సేవా సంస్థల వ్యవస్థాపకుడు దాసరి సన్యాసిశెట్టి దంపతులను భక్తులు శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. గ్రామ సేవయే రామసేవ అని భావించి సత్యసాయి ఆధ్యాత్మిక భావలను ప్రజలకు చేరవేశారని కొనియాడారు. కార్యక్రమంలో అనకాపల్లి జిలా సేవాదళ్ కోఆర్డినేటర్ కోరెడ్డి అప్పలనాయుడు, సిహెచ్.వి. రవిశంకర్, సూర్యం, రమణమూర్తి, రత్నావతి, రమామణి, దొగ్గ భవానీ, సకురునాయుడు, సత్యసాయి సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

117 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి జాహ్నవి

కె.కోటపాడు: వేసవిలో వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి జాహ్నవి తెలిపారు. గురువారం కొరువాడలో ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలను నిర్వహించారు. ఇందులో భాగంగా 117 మందికి ఓపీ ద్వారా వైద్యంతోపాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, రమణ, ఏఎన్ఎం పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

చీడికాడ: కోనాం డాక్టరు బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఈనెల 24వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మి తెలిపారు. ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 23న ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఇందులో ప్రతిభ కనబరిస్తే పాఠశాలలో ప్రవేశం కల్పిస్తామన్నారు.

మెట్ట ప్రాంతాల్లో విస్తారంగా కూరగాయల సాగు


దాలివలసలో టమాట పంట


ఆర్లిలో కాలీఫ్లవర్ పంట

కె.కోటపాడు: మండలంలోని మెట్టప్రాంత గ్రామాల్లో విస్తారంగా కూరగాయల సాగవుతోంది. వేసవి ప్రారంభం కావడంతో కూరగాయల పంటల ఉత్పత్తి తగ్గడంతో అందుబాటులో ఉన్న పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దాంతో గత నెల నుంచి నీటి లభ్యత గల పొలాల్లో కూరగాయలను సాగు చేస్తున్నారు. సూదివలస, కింతాడ, ఆర్లి, బొట్టవానిపాలెం, చంద్రయ్యపేట, కె.కె.అగ్రహారం, కె.సంతపాలెం, గవరపాలెం, పింద్రంగి, దాలివలస గ్రామాల్లో 110 ఎకరాల్లో టమాట పంటను, 50 ఎకరాల్లో కాలీఫ్లవర్ పంటను, 50 ఎకరాల్లో మిరప పంటను, 30 ఎకరాల్లో చిక్కుడు పంటను, 60 ఎకరాల్లో వంగపంటను, 40 ఎకరాల్లో చిక్కుడు పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో పంట దిగుబడి ప్రారంభమైంది. మరి కొన్ని గ్రామాల్లో పూతదశలో ఉన్న కూరగాయల పంటల దిగుబడి మరో నెల రోజుల్లో ప్రారంభం కానున్నట్లు రైతులు చెబుతున్నారు.

వాహనాల వేలంలో రూ.5.89 లక్షల ఆదాయం

మాడుగుల: విశాఖ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు స్థానిక ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయంలో గురువారం సాయంత్రం బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఇందులో ఒక ఆటో, 23 ద్విచక్ర వాహనాలకు వేలం వేయగా, 5 లక్షల 89 వేల 174 రూపాయలు ప్రభుత్వ ఖజానాకు జమ అయినట్లు అనకాపల్లి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జె.రవికుమార్ తెలిపారు.

మాజీ సర్పంచ్ పుణ్యవతి మృతి


పుణ్యవతి (ఫైల్)

మాడుగుల రూరల్: ముకుందపురం మాజీ సర్పంచ్ కర్రి పుణ్యవతి(62) మృతి చెందారు. గురువారం ఉదయం ఆమెకు గుండెపోటు రావడంతో చోడవరం ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించారు. 1995లో ఆమె సర్పంచ్‌గా గెలుపొంది పనిచేశారు. ఆమె కుమారుడు గణేశ్ ప్రస్తుత సర్పంచ్‌గా పని చేస్తున్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ ఆ గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు కిముదు రమణమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు దండి నాగరత్నం, సర్పంచ్‌లు జామి రమణబాబు, అల్లాడ నాగేశ్వరరావు, వెలగాడ కామలక్ష్మి సంతాపం తెలిపారు.